# ఇంకో దీపం వెలిగింది

-సి హెచ్. వి. బృందావనరావు

ఈ ముసలి వయసులో జగన్నాథమూర్తి దంపతులకు భరించరాని కష్టం వచ్చింది. ఇంతదాకా బాగానే గడిచిపోయింది కాలం. ఇప్పుడు, ఈ మునిమాపు సమయంలో భయంకరమైన అగాధంలో తోసేశాడు భగవంతుడు. దిగాలు పడిపోయారు దంపతులిద్దరూ. రోదిస్తూ రోజులు వెళ్లదీస్తున్నది విజయ. నెల రోజుల క్రితం స్కూటరు ప్రమాదంలో జగన్నాథమూర్తీ, సుందరమ్మల ఏకైక కుమారుడు ప్రకాశరావు చనిపోయాడు విజయ ప్రకాశరావు భార్య.

జగన్నాథమూర్తి దంపతులకు లేక లేక పుట్టిన కొడుకు ప్రకాశం. పెళ్లయిన పదేళ్ళదాకా పిల్లలు కలగలేదు వారికి. ఎన్నో తీర్థాలు సేవించి, ఎన్నో గుళ్ళకు ప్రదక్షిణలు చేశాక జగన్నాథమూర్తికి 35 ఏట పుట్టాడు ప్రకాశం.

జగన్నాథమూర్తి ఏదో గవర్నమెంటు ఆఫీసులో గుమాస్తా. తనకొచ్చే పరిమిత ఆదాయంతో తన చిన్న సంసారాన్ని గుట్టుగా నెట్టుకొచ్చేవాడు. సుందరమ్మ కూడా ఎంతో పొదుపుగా కాపురాన్ని నడుపుకొచ్చేది. అలాంటి సమయంలో ఓరోజు వారి సంసారంలోకి ప్రవేశించింది విజయ. విజయ జగన్నాథమూర్తి గారి దూరపు బంధువు మనవరాలు. విజయ తల్లి ఆమెను ప్రసవించి మరణించింది. ఆమె తండ్రి అంతకు ముందే పోయాడు. దిక్కులేని ఆ పిల్లను తమ ఇంటికి తెచ్చుకొని తమ కొడుకుతో పాటు పెంచారు జగన్నాథమూర్తి దంపతులు. తమ ప్రేమను ప్రకాశంతో పాటు విజయకూ సమానంగా పంచారు. ప్రకాశాన్ని చదివించినట్టే విజయనూ చదివించారు. విజయ పనిపాట్లలోనూ, చదవూ సంస్కారాల్లోనూ మణిపూస లాగా పెరిగింది. కాలంతో పాటు ప్రకాశమూ విజయా పెద్దవారయ్యారు.

వాళ్ళిద్దరికీ పెళ్లీడు వచ్చింది. విజయనే కోడలుగా చేసుకున్నారు జగన్నాథమూర్తి దంపతులు.

జగన్నాథమూర్తి అంతకు ముందే రిటైర్ కావడంతో కొడుకు ఉద్యోగం చేస్తున్న సిటీకే అంతా చేరారు. తల్లిదండ్రులు, భార్యతో పట్టాల మీద బండిలాగా ఏ ఒడిదుడుకుల్లేకుండా సాఫీగా సాగిపోతోంది ప్రకాశ రావు సంసారం. అలాంటి సమయంలో జరిగింది ఘోరం. ప్రకాశరావు సాయంత్రం ఇంటికి తిరిగొ స్తుండగా సిటీ బస్ గుద్దుకుంది. ప్రకాశరావుకు బాగా దెబ్బలు తగిలాయని, ఆస్పత్రిలో చేర్చారని ఇంటికి కబురు అందింది. ఘొల్లుమంటూ అందరూ ఆస్పత్రికి చేరేసరికే ప్రకాశరావు తుదిశ్వాస వదిలాడు.

జీవితపు చరమ దశలో ఉండి, కొడుకు చేతి మీదుగా వెళ్లిపోవాల్సిన జగన్నాథమూర్తి దంపతుల శోకం చూసేవారిని కదిలించి వేసింది. ఆ వయసులో చేతికి అందివచ్చిన చెట్టంత కొడుకు మరణంతో వాళ్ళు క్రుంగిపోయారు. విజయ దుఃఖం వర్ణణాతీతం. పెళ్ళయి నాలుగేళ్ళు కూడా కాలేదు, పిల్లలు కూడా లేరు, ఇంత చిన్న వయస్సులోనే భర్తను కోల్పోవడంతో నిర్ఘాంతపోయి శోకమూర్తిగా మారిపోయింది విజయ. పసితనంలోనే తల్లీ, తండ్రీ పోయినా, తెలియని వయస్సు కావడంతో ఆ దుఃఖమేమీ తెలియదు విజయకు.

❖ ❖ ❖

శాశ్వతమైన దుఃఖంలో కూరుకుపోయిన జగన్నాథమూర్తి దంపతులు క్రమంగా దైనిక జీవనంలో పడిపోయారు. కొడుకు మరణంతో పూర్తిగా క్రుంగి పోయారు. వృద్ధాప్యం వారిని మరింత క్రుంగదీసింది. వారి ఆలనా పాలనా విజయపైన పడింది. తన దుఃఖాన్ని దిగమింగి వారికి ఊరటనిస్తోంది విజయ.

కారుణ్య నియామకం కింద విజయకు ఉద్యోగం లభించింది. జగన్నాథమూర్తికి వచ్చే పెన్షన్, విజయ సంపాదనతో వారి ముగ్గురి జీవితాలూ గడిచి పోతున్నాయి. ఆర్థిక సమస్యలు తీరినా వెలితి అలానే ఉండిపోయి బతుకులు భారంగా మారిపోయాయి.

❖ ❖ ❖

వ్యాహ్యాళికి వెళ్ళిన జగన్నాథమూర్తికి విజయ మరో యువకుడితో కలిసి వస్తూ కంటపడింది. దగ్గరకు వచ్చేవరకు ఆయన ఉనికి ఆమె గమనించలేదు. మామయ్యను చూడగానే తొలుత కొంచెం తొట్రుపడినా వెంటనే సర్దుకు పలకరించింది.

'ఆఫీసు నుంచేనా అమ్మా' అడిగారు జగన్నాథ

మూర్తి.

'అవును మామయ్యగారూ' అని తన పక్కనున్న యువకుడిని పరిచయం చేసింది.

'ఈయన వెంకటేశ్వరరావని, ఈ మధ్యే బదిలీపై ఇక్కడకు వచ్చారు. మీ అబ్బాయి ఆయనకు బాగా తెలుసట. ఇంతకు ముందు ఇద్దరూ కలిసి పనిచేశారట' అంది విజయ.

'నమస్కారమండీ. మీ ప్రకాశం నాకు మంచి మిత్రుడు. అంత చిన్న వయస్సులో అలా జరుగు తుందని ఊహించలేదండీ' అన్నాడు వెంకటేశ్వరరావు.

'మన చేతుల్లో ఏముంది?' అని కొడుకు జ్ఞాపకాల తలపుకు రాకవడంతో కళ్ళద్దుకున్నాడు జగన్నాథమూర్తి.

కొద్దిసేపు మాట్లాడాక, 'వస్తానండీ. నా గది ఇక్కడికి దగ్గరే. వస్తానండీ విజయగారూ' అని సెలవు తీసుకున్నాడు వెంకటేశ్వరరావు.

'ఇంటికి వస్తారా మామయ్యా' అడిగింది విజయ.

'నువ్వెళ్లమ్మా, నేను నెమ్మదిగా వస్తాను' అన్నాడు జగన్నాథమూర్తి.

ఇంటికి బయలుదేరింది విజయ.

❖ ❖ ❖

ఆ రాత్రి జగన్నాథమూర్తికి నిద్రపట్టలేదు. తనకింత వరకూ ఈరకమైన ఆలోచన రాకపోవడం ఆయనకు ఆశ్చర్యమనిపించింది. ఈరోజు విజయా, వెంకటేశ్వర రావు కలిసి నడుస్తుండగా చూసినప్పుడు మొదలయిన ఊహల సంఘర్షణ ఇంకా ఆయన మనస్సులో కొనసాగుతూనే వుంది. విజయ వయస్సు ఎంతని? ఇరవయ్యేడో, ఎనిమిదో. అప్పుడే నూరేళ్ళు నిండినట్టు ఏ ముచ్చటా లేకుండా అలా మోడుగా గడచిపో వలసిందేనా? ప్రకాశం, విజయ ఎంత అన్యోన్యంగా ఉండేవారు. నిజమే, ప్రకాశం మరణంతో విజయ బాగా క్రుంగిపోయింది. బ్రతుకు మీద అనురక్తి లేనట్టుగా రోజులు వెళ్ళదీస్తోంది. విజయ బ్రతుకు అలా మృతప్రాయమైపోవలసిందేనా? ఆమెకు మరో తోడును చూపించాల్సిన నైతిక బాధ్యత తమమీద లేదా? అదే విజయ చనిపోయి ఉంటే ప్రకాశానికి పెళ్ళి చేయకుండా ఉండేవారమేనా? ఆమెకు మళ్లీ పెళ్ళి చేసుకోకుండా ముసలివాళ్ళం అడ్డుపడు తున్నామా? అసలు తమకేం అధికారం ఉంది విజయ మళ్లీ పెళ్ళిచేసుకోకుండా అడ్డముండేందుకు? తాము పెంచినంత మాత్రాన ఆమె జీవితానికి అవరోధంగా మారడం ఎంతవరకు సమంజసం? తమకు ఆసరా కోసం ఆమె జీవితాన్ని బలిపెట్టాలా? ఇలా అనంతంగా సాగుతున్నాయి జగన్నాథమూర్తి ఆలోచనలు. సుందరమ్మతో కూడా తన ఆలోచనలు పంచుకుని సరైన నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించుకున్నా డాయన.

❖ ❖ ❖

ఆరోజు ఆదివారం. విజయ ఆఫీసుకు సెలవు. తాము చర్చించుకున్న విషయాన్ని గురించి విజయను కదిలిద్దామనుకున్నాడు జగన్నాథమూర్తి.

'నీతో ఓ విషయం మాట్లాడాలమ్మా' అన్నాడు.

తలెత్తి చూసింది విజయ ఆశ్చర్యంగా. 'నాతో మాట్లాడడానికి ఉపోద్ఘాతమేంటి మామయ్యగారూ' అంది.

'వెంకటేశ్వరరావు గురించి నీ అభిప్రాయమేమిటి?' అడిగాడు జగన్నాథమూర్తి.

'మంచివాడే మామయ్యా' అంది.

'అతన్ని పెళ్ళి చేసుకోవడం నీకు ఇష్టమేనా?'

'మళ్లీ పెళ్ళి చేసుకోవడం నాకు ఇష్టంలేదు. మీ మనసులోంచి ఆ ఊహను చెరిపెయ్యండి'

'నీ అభ్యంతరం, ఆందోళనా అంతా మా భవిష్యత్తు గురించే కదా. మేం పెద్దవాళ్ళమయ్యాం. మాకన్నా

## శేషాద్రి నానీలు

కడలి వైపు / నది పరుగులు
ప్రేమ కూడా అంతే / అశాంతి దిశగా!
కత్తి చేసిన గాయం / మానింది
మాట దెబ్బ మాత్రం
మరణం దాకా

ఎన్ని ఉదయాలో
అన్నే సాయంత్రాలు
తీపి గురుతుల్లో
చేదు గుళికలు

ఎత్తు పల్లాలు / సహజం జీవితంలో
జలపాతం కాదా
మధుర గీతం?

జీవితం విలువ
ఉరికంబం చెప్తుంది
మరి చెరసాల?
స్వేచ్ఛ విలువ

–డా॥ పి. శేషాద్రి

## సలహా

నీకు తెలియకుండానే నీ మనసులో
కదులుతున్న ఆలోచనలకు బదులుగా
నీ కళ్లల్లో కన్నీటి పొర కదిలినపుడు
నీ ఎదుటివారు ఏమని అడిగితే
ఉన్న నిజాన్ని చెప్పి/వారి ముందు చులకన కాకు
బాధకు ప్రతిరూపమైన
నలక పడిందని చెప్పి వారిని జోకొట్టు
నీ మనసులో ఎన్ని సంఘర్షణలు
జరుగుతున్నా తట్టుకొని
నిలబడగలిగిన నాడే, నీ గొప్పతనం
నీకు అర్థమౌతుంది.
నీ సంతోషాన్ని నలుగురితో పంచుకో
నీ దుఃఖాన్ని నీలోనే సమాధి చేసుకో!

## హృదయ వేదన

కానరానంత దూరాన నీవు
కలుసుకోలేని స్థితిలో నేను
అయినా నీవే కళ్లల్లో కదులుతూ
నా ఊహల్లో మెదులుతూ/నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తూ
తీయని బాధను రగిలిస్తున్నావు
గుండె కోతనే మిగులుస్తున్నావు

## పట్టుబుటాలు

వినీలాంబరంలో చుక్కలు మిణుకుమిణుకుమంటూ
నల్లటి వస్త్రంపై పట్టుబుటాల్లా మెరుస్తున్నాయి
తళతళ మెరిసే తారకల సౌందర్యం
మెల్లగ సాగే సెలయేటి ఝరిలో
మిలమిల మెరిసే మాయమయే
మీనుల మెరుపును మరిపిస్తున్నది
నిండు పున్నమినాటి శరశ్చంద్రుని ధవళకాంతి
పీసాటవర్ నుంచి నేలకు జారే
వెన్నెల సోపానంలా ఉంది
చంద్రకాంతిలో మెరిసే నందివర్ధనం
నక్షత్రం చిందించే ధగధగలను
వెక్కిరిస్తోంది - నా మెరుపు ముందు
నీ తళుకు దిగదుడుపేనని-
మంద్రంగా వినిపిస్తున్న సితార్ వాదన
మలయమారుతంతో పాటు చెట్టా పట్టా
లేసుకుని ప్రయాణిస్తూ/చెట్టు పుట్టలను చుట్టుముడుతూ
తరంగంలా తేలివస్తోంది.

-పోడూరి శ్రీనివాసరావు

నీ భవిష్యత్తు ముఖ్యం. నీ జీవితాన్ని మా కోసం బలిచేసుకోవద్దు. నీ గురించి నువ్వు ఆలోచించుకో' అన్నాడు జగన్నాథమూర్తి.

'మీతో కలిసి బ్రతకడంలో నా బ్రతుకు బలి అవుతోందని నేను భావించడంలేదు. మీరూ అలా అనుకోకండి. నాకు మరో పెళ్ళి ఇష్టంలేదు. నన్ను ఇలా ఉండనీయండి చాలు' అంది విజయ.

'చూడు తల్లీ, మాకు వయసైపోయింది. నీవు వయస్సులో ఉన్నావు. నీకో తోడు అవసరం. మా తర్వాత నువ్వు ఒంటరివైపోతావు. బాగా ఆలోచించుకో' అన్నాడు జగన్నాథరావు.

'బాగా ఆలోచించుకునే చెపుతున్నాను మామయ్యగారు. నన్ను బలవంతం చేయకండి' అంది విజయ.

❖ ❖ ❖

జగన్నాథమూర్తికి మాత్రం సంతృప్తిగా లేదు. విజయ బ్రతుకు ఒక గాడిలో పడాలనీ, ఆమె మళ్లీ పెళ్లి చేసుకోవాలని గాఢంగా ఉంది. కానీ ఎంత చెప్పినా విజయ వినడంలేదు. జగన్నాథమూర్తికి తెలుసు, తమకోసమే విజయ పెళ్ళి వద్దంటోందని. ఆమె జీవితం ఒక స్థిరత్వం పొందాలంటే తాము అడ్డు తప్పుకోవడం ఒక్కటే మార్గమని ఆయనకు తోచింది. తీవ్రంగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు.

❖ ❖ ❖

విజయ ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి తాళం వేసి ఉంది. అత్త మామలు అప్పుడప్పుడు గుడికో, పార్కుకో వెళ్ళడం మామూలే. తన దగ్గరున్న డూప్లికేట్ తాళంతో లోపలకు వెళ్ళాక కాని ఆమెకు అసలు విషయం అర్థం కాలేదు. అత్త మామలకు సంబంధించిన వస్తువులేవీ ఆమెకు కన్పించలేదు. వాళ్ళిద్దరూ తనకు చెప్పకుండా ఇల్లు విడిచి వెళ్ళిపోయారని ఆమెకు అర్థమైంది.

కూలబడిపోయింది విజయ. ఇంతకాలం కన్న కూతురుకన్నా ఎక్కువగా తనను ఆదరించి, కనీసం ఒక్క మాటయినా చెప్పకుండా వెళ్ళిపోయినందుకు బాధపడింది. వాళ్ళుంటే తాను పెళ్ళి చేసుకోనని భావించి ఇలా చేసి ఉంటారని ఆమెకు అర్థమైంది. ఎంత సంస్కారవంతుడు మామయ్య. నా సుఖం కోసం ఆరాటపడుతున్నారు. పెద్దవాళ్ళకి చాదస్తం ఎక్కువంటారు. కానీ మామయ్య ఎంత ప్రగతిశీలంగా ఆలోచిస్తున్నారు. అత్తయ్య కూడా ఆయన తగ్గ

సహధర్మచారిణే. ఎక్కడికి వెళ్ళారో, ఎన్ని అవస్థలు పడుతున్నారో అని దీర్ఘ చింతనలో మునిగిపోయింది విజయ.

❖ ❖ ❖

అక్కడికి యాభై మైళ్ల దూరంలోని ఓ ఊర్లో ఉన్న వృద్ధాశ్రమంలో చేరి పదిరోజులయింది జగన్నాథరావు దంపతులు. తన పెన్షన్‌లో కొంత భాగం ఆశ్రమం వారికి ఇవ్వడం, అక్కడే భోజనాదికాలు చేయడం, మిగిలిన వృద్ధులతో కలిసి జీవించడం- ఇలా స్థిరపరచుకున్నారు వారి జీవితాలను.

'అమ్మాయితో చెప్పి అయినా వచ్చుండాల్సింది' అంది సుందరమ్మ ఒకరోజు తీరిగ్గా కూర్చోనుండగా.

'చెపితే రానిచ్చేది కాదు. వెంకటేశ్వరరావంటే అమ్మాయికి ఇష్టమున్నట్టే వుంది. వెంకటేశ్వరరావుకూ ఆ కోర్కె వున్నది. మనం లేకపోతే వాళ్ళు ఒకటవుతారు. కొన్ని రోజులయిన తర్వాత చూసి వద్దాంలే' అన్నాడు జగన్నాథమూర్తి.

'మీ కోసం ఎవరో వచ్చారండీ' అని చెప్పింది ఆశ్రమంలోని వంటలక్క

సుందరమ్మ బయటకు వచ్చి చూసింది. విజయ! ఆమె పక్కన ఓ ఐదేళ్ళ పిల్లవాడున్నాడు.

'అమ్మా విజయా' అని తన్మయత్వంతో విజయను ఆలింగనం చేసుకుంది సుందరమ్మ.

'అత్తయ్యా' అంటూ కరిగిపోయింది విజయ.

అప్పుడే జగన్నాథమూర్తి వారిని సమీపించాడు.

'మామయ్యగారూ, ఒక్క మాట కూడా చెప్పకుండా వెళ్ళిపోయేంత తప్పేం చేశాను నేను' అని దుఃఖాన్ని అదుపుచేసుకుంటూ ప్రశ్నించింది.

'జరిగిందేదో జరిగిపోయింది. ఇక బయలుదేరండి మన ఇంటికి పోదాం. ఏ దిక్కూలేని వారిలాగా మీరు వృద్ధాశ్రమంలో ఉండాల్సిన ఖర్మేం పట్టలేదు' అని తొందర చేసింది..

'ఆ పసివాడు ఎవరమ్మా' అని అడిగింది సుందరమ్మ.

'వీడు నా స్నేహితురాలి దూరపు బంధువుల పిల్లవాడు. తల్లీ తండ్రీ లేరు. వాడి బాగోగులు పట్టించుకునే వారెవరూ లేరు. అనాథాశ్రమంలో చేర్చబోతుంటే నేను తెచ్చుకున్నాను. వాడింక మనతోటే వుంటాడు. వాణ్ణి పెంచుతాను. చదివించి పెద్దవాణ్ణి చేస్తాను. పెళ్ళి చేస్తాను. మీరు కోరుకున్నట్టే నాకూ సంసారం ఏర్పడుతుంది. మీరు నన్ను ఆదరించినట్టే వాడికి నేను. మీరు నాకు పంచిన ప్రేమనే, నేనూ వాడికి పంచుతాను. బంధువులెవరూ నావైపు కన్నెత్తి చూడని రోజుల్లో నన్ను అక్కున చేర్చుకున్నారు. లక్షల కట్నాల కోసం ఆశించకుండా నన్ను కోడలిని చేసుకున్నారు. అటువంటి మిమ్మల్ని నా సుఖం కోసం వృద్ధాశ్రమంలో వదిలేసే అల్పురాలిని కాదు. ఇక నా జీవితం అసంపూర్తిగా ఉందనుకోవద్దు. జీవితంలో అందరికీ అన్నీ అమరవు. అంత మాత్రాన వారు సుఖంగా బ్రతకడంలేదా? మనందరం కలిసి ఆనందంగా, సంపూర్ణంగా బ్రతుకుదాం. త్వరగా బయలుదేరి రండి, బయట టాక్సీ రెడీగా వుంది' అంది విజయ.

పెట్టేబేడా జగన్నాథమూర్తి, విజయ పట్టుకొస్తుంటే, పిల్లాణ్ణి చంకనెత్తుకుంది సుందరమ్మ.

■

# ఉన్మాదం

మతోన్మాదానికి సమాంతరంగా ప్రేమోన్మాదం
ఒకదానితో ఒకటి పోటీపడి చిచ్చు రగిలిస్తున్నాయి
'శ్రీలక్ష్మి', 'ఆయేషా'ల ఆత్మలు శాంతించకముందే
మీనాకుమారి రక్తం ఈ రోజు వరదగా మారింది
సుభాని, మనోహర్, సందీప్.. పేరేదైనా ప్రతిఒక్కడూ
ఉన్మాదే, వ్యక్తిత్వ వికాసంలేని రాతియుగపు జంతువే
ఈ దారుణాలలో ఎవరిది పాపం? ఎక్కడుంది లోపం?
విలువలవసరం లేని విద్యా విధానానిదా? బాధ్యతా రహిత
సామాజిక స్పృహ లోపించిన తల్లిదండ్రులదా?
ఉండీ లేనట్లుండే ఈ (అ)వ్యవస్థదా?
ధన, రాజకీయ శక్తులకు దాసోహమంటున్న రక్షక దళానిదా?
గత రెండు రోజులుగా మీడియాది ఒకటే హడావిడి
తర్వాత్తర్వాత అందరూ గప్‌చుప్, అంతా ప్రశాంతం
మళ్ళీ మరో ఉన్మాదం, ఇంకో కుమారిని
కబళించే వరకూ ఎవడి గోల వాడిదే...

–?

*(విజయవాడలో సహ విద్యార్థి దాడికి గురైన 'మీనాకుమారి' సంఘటనకు ప్రతిస్పందనగా)*